క్లుప్తంగా

వ్యవసాయ అధికారుల తనిఖీలు



ఎరువుల గోదాములో తనిఖీ చేస్తున్న డీఏఓ బాబురావు, డీడీఏ సరిత, తదితరులు

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేటలో విశాల సహకార పరపతి సంఘం పరిధిలోని ఎరువుల గోదాములో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వేల్పుల బాబురావు, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బి.సరిత బుధవారం తనిఖీలు నిర్వహించారు. స్టాకు రిజిస్టర్‌ను తనిఖీ చేసి, ఎరువుల నిల్వలు తదితర వివరాలను పరిశీలించారు. యూరియా సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నానో యూరియా వాడకం పట్ల రైతులకు తగు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో దమ్మపేట ఏఓ చంద్రశేఖర రెడ్డి, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు లాభం చేకూర్చేందుకే పన్ను రద్దు

దుమ్ముగూడెం: పత్తి దిగుమతిపై ఉన్న 11 శాతం టాక్స్ రద్దు చేయడం కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చడానికే అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ విమర్శించారు. బుధవారం కాటాయిగూడెం శాఖ సమావేశం కాక కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మాట మారుస్తూ.. టాక్స్ రద్దు చేయడం, దానిని డిసెంబర్ 31 వరకు పొడిగించడం ఆమోదయోగ్యం కాదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, నాయకులు మర్మం సమ్మక్క, కొరసా నాగరాజు, సర్వేశ్వరరావు, శ్రీరాములు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్య జోడా యాత్రకు ఘనస్వాగతం



యాత్ర నాయకులకు స్వాగతం పలుకుతున్న మండల ఆదివాసీ సంఘ నాయకులు

బూర్గంపాడు: చలో భద్రాచలం ధర్మయుద్ధం కార్యక్రమంలో భాగంగా ఆదివాసీలు తలపెట్టిన జన చైతన్య జోడా యాత్రకు బుధవారం బూర్గంపాడు మండలంలో ఘనస్వాగతం పలికారు. ఆదివాసీ సంఘం మండల నాయకుడు, యాత్ర రథసారథి చుంచు రామకృష్ణకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు తాటి సత్యనారాయణ, గనిబోయిన చిపిరయ్య, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయగాంధీ, సున్నం భీమరాజు, బొర్రా భద్రయ్య,పొడియం నరేంద్ర, కుర్సం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఉద్యోగుల బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని మహిళా ఉద్యోగులు బుధవారం ఘనంగా బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఐటీడీఏ నివాస గృహ సముదాయంలోని మహిళలు బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా ఆడిపాడారు. ఈ వేడుకకు ఆర్సీఓ అరుణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, అలివేలు మంగతాయారు, అనసూయ, మాధవి, భవాని, ప్రియాంక, అరుణ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆందోళనలకు సిద్ధం కావాలి'

మణుగూరురూరల్: ఇటీవల సింగరేణి సీఅండ్ఎండీ బలరాం.. ఆర్‌లో మణుగూరు ఏరియా బొగ్గు గనులు ఉండవని ఇచ్చిన ప్రకటన నేపథ్యంలో మణుగూరు మనుగడ కోసం ప్రజలంతా ఆందోళనలకు సిద్ధం కావాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్నేహగార్డెన్స్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. సీఎండీ ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి ప్రజలకు భరోసా ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు నాసర్‌పాషా, మిడిదొడ్ల నాగేశ్వరరావు, దుర్గ్యాల సుధాకర్, ఎడారి రమేష్, సర్వర్, మంగి వీరయ్య, జీవీ రంజిత్, పి.శ్రీనివాస్, కె.ప్రసాద్, సీతారాములు, పి.పాపారావు, పి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకటికి.. రెండుకూ అవస్థలే!





మణుగూరు వంద పడకల ఆస్పత్రిలో మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు

- మరుగుదొడ్లు లేక ప్రజలు అవస్థలు
- మహిళల పరిస్థితి వర్ణనాతీతం
- బస్టాండ్‌ల నుంచి ఆస్పత్రులదాక ఇదే దుస్థితి

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గంలో మండల కేంద్రంగా ఉన్న మణుగూరులో మరుగుదొడ్ల లేమి వేధిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతున్న 100 పడకల ఆస్పత్రిలో మరుగుదొడ్లు మరమ్మతులకు గురై.. చికిత్స పొందుతున్న రోగులు, తోడు ఉండే అటెండెంట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగాలు నయం చేయించుకునేందుకు వస్తే మరిన్ని రోగాలు ప్రబలే పరిస్థితులున్నాయని వాపోతున్నారు.

ఆరుబయటకే..

స్థానిక 100 పడకల ఆస్పత్రి నియోజకవర్గంలోని కరకగూడెం, పినపాక, మండలాల శివారు గ్రామాలతో పాటు మణుగూరు, అశ్వాపురం మండలాలకు, శివారు ఆదివాసీ గ్రామాలకు ఏకైక పెద్ద దిక్కుగా ఉండి వైద్యుల కొరవతో కల్పతరువుగా మారింది. ఈ క్రమంలో నిత్యం ఏడాదిలో సగటున రోజుకు 300 పైచిలుకు రోగులు ఓపీ వైద్య సేవలు వినియోగించుకుంటూ ఉంటారు. దీనికి ఇన్‌పేషంట్లు, ఇతర చికిత్సల కోసం వచ్చే వారు అదనం. వీరంతా బాహిర్భూమికి వెళ్లాలన్నా, కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా ఆరుబయటే చూసుకోవాల్సిందే. జనరల్ వార్డు మొదలుకుని ఇతర ప్రదేశాల్లో ఉన్న పురుషులు, మహిళలు వినియోగించే మరుగుదొడ్లు సుమారు 60–70 శాతం అన్నీ మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని గదుల్లో శుభ్రం చేయక వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీంతో అడ్మిట్ అయిన రోగులు బాహిర్భూమికి వెళ్లాలంటే దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. బయటకు వెళ్లలేక మరమ్మతులకు గురైన టాయిలెట్ గదులకు వెళ్లలేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రికి ఆరోగ్య శ్రీ, డయాలసిస్, స్పెషల్ రూంలను రోగులకు కేటాయింపులతో వివిధ రూపాలలో సమకూరే ఆదాయాలతో చిన్నపాటి మరమ్మతులు చేపట్టే అవకాశం ఉన్నా నిర్లక్ష్యం చూపుతుండటంపై రోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేయిస్తాం..



కొద్ది రోజుల క్రితమే అన్ని వార్డుల్లో శానిటేషన్ సిబ్బంది మరుగుదొడ్లు శుభ్రం చేయించి మరమ్మతులు చేపట్టారు. అయినా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రోగులు డైపర్లు, చిరిగిన దుస్తులు వాటిల్లో వేయడం వల్ల డ్రెయినేజీ బ్లాక్ అవుతోంది. నిధుల విడుదలలో కొంత జాప్యం ఉంది. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతాం. రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– సునీల్, ఆస్పత్రి సూపరింటెండెంట్

బస్టాండ్, వారపు సంతలో..

అశ్వాపురం: మండల కేంద్రం అశ్వాపురానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు పబ్లిక్ టాయిలెట్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. పురుషులు అక్కడో.. ఇక్కడో పని కానిచ్చేస్తుండగా మహిళల బాధలు చెప్పలేనివిగా ఉన్నాయి. మండల కేంద్రం నుంచి దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్ లేక ప్రధాన రహదారి వెంబడి బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉంటున్నారు. వారు మరుగుదొడ్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు, మండల కేంద్రంలో ప్రతి సోమవారం వారపు సంత నిర్వహిస్తారు. ఈ సంతకు మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు, చుట్టూ ప్రక్కల మండలాల చిరు వ్యాపారులు, ప్రజలు వేల మంది వస్తుంటారు. ఇక్కడ కూడా పబ్లిక్ టాయిలెట్లు లేక జనం నానా అవస్థలు పడుతున్నారు. పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని ప్రజలు ఎన్నో ఏండ్లుగా కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి..



మండలంలో 24 గ్రామ పంచాయతీల నుంచి ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. ప్రజలు ముఖ్యంగా మహిళలు పబ్లిక్ టాయిలెట్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి.

– గద్దల రామకృష్ణ, అశ్వాపురం

మహిళలకు ఇబ్బందులు..



మారుమూల ప్రాంతాల నుంచి ఆఫీసులకు, ఇతర పనులకు మండల కేంద్రానికి రోజు వస్తుంటాం. అక్కడ పబ్లిక్ టాయిలెట్లు లేక వివిధ మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి.

– స్వరూప, మాజీ సర్పంచ్, మనుబోతులగూడెం

ఇందిరమ్మ నమూనా గృహాలు ప్రారంభం

బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు పనిముట్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం బూర్గంపాడు సీహెచ్‌సీలో చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సకాలంలో నాణ్యతతో భవన నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ బాలయ్య, ఎంఈఓ యదుసింహరాజు, ఏఓ శంకర్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటిని బుధవారం ఎమ్మెల్యే పాయం ప్రారంభించారు. గిరిజనులకు ప్రత్యేక కోటాలో మంజూరైన 97 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు గడ్డపార, తట్టలు పంపిణీ చేశారు. కాగా, వచ్చిన ప్రజలకు పూర్తి స్థాయిలో కుర్చీలు లేకపోవడం, అధికారుల వద్ద లబ్ధిదారుల జాబితా లేకపోవడం, కనీసం సమాచారం లేకపోవడంతో ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఏపీఓ సీతారాములుపై ఎమ్మెల్యే పాయం ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపీఓ ముత్యాలరావు, ఎంఈఓ వీరస్వామి, హౌసింగ్ ఏఈ ఉదయ్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఊసా అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు, లబ్ధిదారులు, కూలీలు, ప్రజలు పాల్గొన్నారు.



అశ్వాపురం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం

రేపటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్


దుమ్ముగూడెం: మండలంలోని అంజుబాక గ్రామంలో అంజుబాక యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 29 తేదీల్లో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బతుకమ్మ, దసరా సందర్భంగా నిర్వహించనున్న ఈ పోటీల విజేతలకు మొదటి బహుమతిగా రూ.10,116, ద్వితీయ బహుమతిగా రూ.7,116, మూడో బహుమతిగా రూ.5,116, నాలుగో బహుమతిగా రూ.3,116లతో పాటు షీల్డ్ అందజేయనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ టీమ్ పేర్లను ఎంట్రీఫీజు రూ.300, ఆధార్ కార్డులతో నిర్వహణ కమిటీ వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 9652345136, 6309722732 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దినసరి కార్మికుల నిరసన ర్యాలీ

అశ్వారావుపేటరూరల్: హాస్టల్, ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న దినసరి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేపట్టి సమ్మె 13వ రోజుకు చేరింది. బుధవారం సమ్మె శిబిరాన్ని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. అనంతరం సమ్మె శిబిరం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బి.చిరంజీవి, మడిపల్లి వెంకటేశ్వరరావు, పిట్టల అర్జున్, రఘు, శ్రీను, నాగమణి, రామలక్ష్మి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఏజీహెచ్‌ఎస్, పీఎంహెచ్ బాలికలు, పీఎంహెచ్ బాలుర, ఎస్టీ బాలుర హాస్టళ్ల ఎదుట వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. బుధవారం సమ్మె శిబిరాన్ని బీసీ సంక్షేమ సంఘం నాయకులు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ బుర్ర సోమేశ్వర్‌గౌడ్, నాయకులు జి.వెంకటేశ్వరరావు, పి.సాంబశివరావు, పి.వీరబాబు, జి.శ్రీనివాస్, మధు, బి.కవిత, శిరీష, శాంతమ్మ, ఆశ్రమ పాఠశాల వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దినసరి కార్మికులు

'అన్నపూర్ణాదేవి'గా అమ్మవారు

దేవి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు మండపాల్లో అమ్మవారిని కూరగాయాలు, కలువ పూలతో అలంకరించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు దుర్గామాతకు చీర, సారె సమర్పించారు. కాగా, పర్ణశాల శ్రీ సీతారామాలయంలోని లక్ష్మి అమ్మవారు సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: అన్నపూర్ణ దేవి రూపంలో..



పర్ణశాలలో సంతానలక్ష్మి అవతారంలో అమ్మవారు

అప్రమత్తంగా ఉండాలి

ములకలపల్లి: సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మధుప్రసాద్ సూచించారు. మండలకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్సై మాట్లాడారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు అకౌంట్ వివరాలు, పిన్ నంబర్లు చెప్పొద్దని సూచించారు. వాట్సాప్ గ్రూపుల్లో గుర్తుతెలియని వ్యక్తులు పంపిన లింక్‌లు ఓపెన్ చేయవద్దని పేర్కొన్నారు. మేనేజర్ పుల్లారావు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ సభ్యురాలిగా పద్మ

చండ్రుగొండ: జిల్లా ఆత్మ కమిటీ సభ్యురాలిగా చండ్రుగొండకు చెందిన బుంగా పద్మను నియమించారు. అశ్వారావుపేటలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణలు పద్మకు నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, మాజీ సర్పంచ్ రుక్మిణి పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ

అశ్వాపురం: భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో సీఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గౌతమీనగర్ కాలనీ వీధులలో చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ అమిత్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలంపాట

బూర్గంపాడు: అక్రమ రవాణాలో అధికారులు పట్టుకుని సీజ్ చేసిన ఇసుకను విక్రయించేందుకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఇసుకను రూ.62 వేలకు స్థానికులు వేలంపాటలో పాడుకుని నగదు చెల్లించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

సీసీఆర్టీ ట్రైనింగ్ పూర్తి

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దపాడు ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన మోహన్‌కుమార్ న్యూ ఢిల్లీలో సీసీఆర్టీ 15 రోజుల ట్రైనింగ్ పూర్తి చేసుకుని సీసీఆర్టీ డైరెక్టర్ రాజీవ్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో భాగంగా మోహన్ కుమార్.. భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం శాలువాతో డైరెక్టర్‌ను సత్కరించారు.

బియ్యం వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం సుభాష్‌నగర్ కాలనీకి చెందిన 13 ఏళ్ల దివ్యాంగురాలు చిట్టికి దాతలు బుధవారం వితరణ అందజేశారు. పట్టణంలోని చేతన మీసేవ నిర్వాహకుడు భూక్యా రంజిత్ నాయక్ చిట్టి దీన స్థితిని తెలుసుకుని ఆమె అమ్మమ్మ అలిమాకు 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా వ్యవస్థాపక అధ్యక్షుడు కొప్పుల మురళి, భూక్యా మాన్ సింగ్, దారావత్ భాస్కర్, కొండపల్లి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు నాటారు.. వీళ్లు నరికారు!

కరకగూడెం: 'హరితహారం'కార్యక్రమంలో సరిగా ఆలోచించకుండా గతంలో పలు చోట్ల 33 కేవీ విద్యుత్ లైన్ల కింద పంచాయతీ అధికారులు మొక్కలు నాటారు. ఇప్పుడు ఆ మొక్కలు పెద్ద చెట్లుగా ఎదిగి, విద్యుత్ తీగలకు తాకుతున్నాయి.దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి విద్యుత్ శాఖ అధికారులు ఆ చెట్ల కొమ్మలను నరికివేస్తున్నారు. దీనివల్ల పచ్చదనం లక్ష్యం దెబ్బతినడంతోపాటు.. రెండు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం స్పష్టమవుతోంది. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 'వన మహోత్సవం'కార్యక్రమంలోనైనా తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది.



కరకగూడెంలో విద్యుత్ తీగల కింద నరికిన చెట్ల కొమ్మలు

ఆస్పత్రుల్లో వైద్యాధికారి తనిఖీ

మణుగూరురూరల్: మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఐటీడీఏ అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సైదులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లోని రికార్డులు, ఐఎల్‌ఆర్–ఫార్మసీ, వ్యాక్సిన్ సేఫ్టీ, ల్యాబ్ రికార్డులు, స్కానింగ్ పనితీరును పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసౌకర్యాలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్వస్థ్ నారీ శక్తివంతమైన కుటుంబ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో వైద్యశిబిరం నిర్వహించగా.. ఆ కార్యక్రమాన్ని సందర్శించారు. శిబిరంలో జనరల్ ఫిజియన్ వైద్యులు 130మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి నివారణ మందులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చైతన్య, డీపీఎంఓ పాయం శ్రీనివాస్, ఆస్పత్రి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, హెచ్ఈఓ గొంది వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాయిమోహన్, డాక్టర్ నిశాంత్ రావు, డాక్టర్ సునీల్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ సైదులు

మున్సిపాలిటీలో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్ అనంతరం మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

మణుగూరుటౌన్: అపరిచితుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని చేపలమార్కెట్‌లో ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల ఆధార్ తదితర వివరాలను పరిశీలించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నివాసాల్లోని మోటార్ సైకిళ్ల ధ్రువపత్రాలు పరిశీలించి ఎటువంటి పత్రాలు లేని 43 మోటార్‌సైకిళ్లు, 4 ఆటోలు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో 100కు కాల్ చేయాలని, యువత గంజాయికి బానిస కావొద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ నాగబాబు, ఎస్ఐ రంజిత్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



అభివాదం చేస్తున్న పీవీటీజీ సంఘాల నాయకులు

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలోని పీవీటీజీ (పర్టిక్యూలర్లీ వెల్నరబుల్ ట్రైబల్ గ్రూప్)లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పీవీటీజీ ఐక్య వేదిక ప్రభుత్వాన్ని కోరింది. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పీవీటీజీల రాష్ట్ర స్థాయి ఐక్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పీవీటీజీలుగా ఉన్న చెంచులు, కోలాంలు, తోటి, కొండరెడ్లు సామాజికంగా విద్య, ఉద్యోగ రంగాలతో పాటు ఆర్థిక, రాజకీయంగా బాగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చపాకటి దస్రు, ఆత్రం భీంరావు, కుడిమేత తిరుపతి, నిమ్మల శ్రీనివాస్, ముర్ల రమేష్, కథల రామిరెడ్డి, చిప్పల కొమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ములకలపల్లి: కొమరంభీం నగర్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అనుమతినివ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, ఎఫ్ఆర్ఓ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంగలిగుట్ట గ్రామానికి సమీపంలోని గొత్తిగోయ ఆవాసమైన కొమరంభీగర్‌కు విద్యుత్, మంచినీటి సౌకర్యం లేక నానాతిప్పలు పడుతున్నారని అన్నారు. ఈ మేరకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇచ్చి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, గ్రామస్తులు పొడియం రాజు, దేవా, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

దసరా కానుకగా జీఎస్టీ తగ్గింపు



భద్రాచలంటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు దసరా కానుకగా జీఎస్టీని తగ్గించి సామాన్యులకు వెసులుబాటు కల్పించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కుంజా ధర్మ నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సమక్షంలో డాక్టర్ టీ. పాపయ్య బీజేపీ పార్టీలో చేరారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితో ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి సతీష్, ముత్యాల శ్రీనివాస్, చెల్లుబోయిన వెంకన్న, పేరం ఉపేందర్, మలిశెట్టి రామ్మోహన్ రావు, దేవరపల్లి వెంకటేశ్వర్లు, కనసాని శ్రీనివాస్, రామాచారి, అల్లాడి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయమని జీఎస్టీ ప్రచార కమిటీ జిల్లా కో కన్వీనర్ బండారు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం అశ్వారావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గించే నిర్ణయం పట్ల దేశ ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు మెట్ట వెంకటేష్, ఎస్‌వీటీ కొండ, రాయుడు ఆంజనేయులు, పమిడి లక్ష్మీనారాయణ, జల్లిపల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే వేడుకలు

జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) డే వేడుకలు పలు విద్యాసంస్థల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉచిత వైద్య శిబిరం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. కళాశాలల్లో ప్రిన్సిపాల్‌లు మాట్లాడుతూ.. యువతలో సేవాభావాన్ని పెంపొందించేందుకు భారత ప్రభుత్వం జాతీయ సేవా పథకాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. విద్యార్థి దశలోనే సమాజ సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి ముందడుగు వేయాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావును సన్మానిస్తున్న అధ్యాపకులు



అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం



చర్ల: సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్